క్లుప్తంగా

కౌలు కార్డుల జారీపై సమీక్ష


వీఆర్వోలతో సమీక్షిస్తున్న ఏఓ నిరంజన్

కోవెలకుంట్ల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రైతులకు కౌలు కార్డుల జారీపై వ్యవసాయ, రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం వీఆర్వోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డి, వ్యవసాయాధికారి నిరంజన్ మాట్లాడుతూ.. వచ్చే నెల నుంచి ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్న దృష్ట్యా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందజేయనున్నామని తెలిపారు. నిబంధనల ప్రకారం యజమాని, కౌలు రైతుల అగ్రిమెంట్, యజమాని పాస్‌పుస్తకం, ఇద్దరి ఆధార్‌కార్డులు, బ్యాంకు ఖాతా జిరాక్స్ కాపీలు, పాస్‌పోర్టుసైజ్ ఫొటోలు, తదితర వివరాలతో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. మండలంలోని కౌలు రైతులు సంబంధిత వీఆర్వోలను సంప్రదించి కౌలు కార్డులు పొందాలని సూచించారు. ఆర్ఐ రంజిత్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ పుల్లయ్య, వ్యవసాయశాఖ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఘనంగా చౌడేశ్వరిదేవి పల్లకీ సేవ


చౌడేశ్వరిదేవి పల్లకీ సేవ నిర్వహిస్తున్న భక్తులు

బనగానపల్లెరూరల్: మండలంలోని నందవరం చౌడేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారి పల్లకీ సేవ శుక్రవారం ఘనంగా జరిగింది. ఉదయం ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమార్చన, అభిషేకం తదితర పూజలు జరిగాయి. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని విశేషంగా అలంకరించిన పల్లకీలో ఆశీనులు గావించి ఆలయ ప్రాకారంలో ప్రదక్షిణ చేయించారు. భక్తులకు తీర్థ ప్రసాదం పంపిణీ చేశారు.

వైఎస్సార్‌సీపీ నేత మృతికి నివాళి


నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కాటసాని

కొలిమిగుండ్ల: అబ్దులాపురానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత సంగిరెడ్డి రామసుబ్బారెడ్డి(65) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు లాయర్ మహేశ్వరరెడ్డి, నాయకులు పేరం సత్యనారాయణరెడ్డితో పాటు పలువురు నాయకులు అబ్దులాపురం వెళ్లి మృతదేహానికి నివాళులర్పించారు. ఆయన మృతి పార్టీకి లోటని పేర్కొన్నారు.

గాయపడిన వ్యక్తి మృతి

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల– జమ్మలమడుగు ఆర్‌అండ్‌బీ రహదారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన నారాయణరెడ్డి(65) శుక్రవారం మృతి చెందినట్లు ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. అవుకు మండలం శివవరానికి చెందిన నారాయణరెడ్డి గురువారం బైక్‌పై కోవెలకుంట్ల నుంచి జమ్మలమడుగు వైపు వెళుతూ ముందు వెళుతున్న మరో బైక్‌ను ఓవర్‌టేక్ చేయబోయి ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రున్ని చికిత్స నిమిత్తం నంద్యాలకు తరలించగా చికిత్స పొందుతూ కోలుకోలేక మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కొలిమిగుండ్ల: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక శుక్రవారం మృతి చెందినట్లు సీఐ రమేష్‌బాబు తెలిపారు. ఈనెల 2వ తేదీ ఇటిక్యాలకు చెందిన ఏసురత్నం(30) పని నిమిత్తం కారులో కొలిమిగుండ్లకు బయలుదేరాడు. స్థానిక కస్తూర్బా పాఠశాల సమీపంలోని మలుపు వద్ద తాడిపత్రి వైపు నుంచి వస్తున్న లారీ ఎదురెదురుగా ఢీకొనడంతో ఏసురత్నంకు తీవ్రగాయాలయ్యాయి. మరొకరు స్వల్పగాయాలతో బయట పడ్డారు. కుటుంబ సభ్యులు చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

బేతంచెర్ల: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ప్రాజెక్టు ఆఫీసర్ దుర్గయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తిప్పమ్మ అన్నారు. శుక్రవారం పట్టణంతో పాటు సిమెంట్‌నగర్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కిశోర వికాసం, కౌమార బాలికల సాధికారత, బాలికలకు గుడ్‌టచ్–బ్యాడ్ టచ్‌లను వివరించారు. తల్లిదండ్రులు కిశోర బాలికలకు సెల్‌ఫోన్లను సాధ్యమైనంత వరకు దూరంగా ఉంచడం మంచిదన్నారు. యుక్త వయసులో సెల్‌ఫోన్లు వినియోగించడం వల్ల మానసిక సమస్యలు, చెడు ఆలోచనలు, చెడు అలవాట్లతో చదువుపై అశ్రద్ధ వహిస్తారన్నారు. అమ్మాయిలకు 18 ఏళ్లు, అబ్బాయిలకు 21 ఏళ్లు నిండిన తరువాతనే వివాహాలు చేయాలన్నారు.

చల్లగా.. ఆరోగ్యంగా..!

- వేసవి తాపానికి ఉపశమనంగా పుచ్చకాయలు
- చల్లదనంతో పాటు ఆరోగ్యం సొంతం
- కొనుగోలుకు ఆసక్తి చూపిస్తున్న ప్రజలు


బనగానపల్లెలో విక్రయానికి ఉంచిన పుచ్చకాయలు

బనగానపల్లె రూరల్/ డోన్ రూరల్: ప్రస్తుతం ఎండలు మండిపోతున్నాయి. ఉదయం పది దాటితే వేడిగాలులు ప్రారంభమవుతున్నాయి. ప్రజలు ఎండ వేడి, ఉక్కపోతతో అల్లాడిపోతున్నారు. దీంతో ఉపశమనం కోసం శీతలపానీయాలు, పుచ్చకాయలు(కలింగపండ్లు) తీసుకుంటున్నారు. ముఖ్యంగా పుచ్చకాయలు చల్లదనంతో పాటు పోషకవిలువలు ఉండడంతో కొనగోలుకు ఆసక్తి చూపుతున్నారు.

జోరుగా విక్రయాలు

డోన్, బనగానపల్లె నియోజకవర్గాల్లోని అన్ని ప్రాంతాల్లో పుచ్చకాయల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. అన్ని మండలాల్లో చిరు వ్యాపారులు సైతం పుకాయలను విక్రయిస్తున్నారు. వీటిని తమిళనాడు, కడప, మదనపల్లె తదితర ప్రాంతాల నుంచి తీసుకొచ్చి ఇక్కడి విక్రయిస్తున్నారు. ఇతర పండ్లు, ఫలాలతో పోలిస్తే పుచ్చకాయలు సరసమైన ధరలతో లభిస్తున్నాయి. వ్యాపారులు కేజీ రూ.20 నుంచి 25 వరకు విక్రయిస్తున్నారు. అలాగే ప్లేటు, ఒప్పులుగా చేసి రూ.10 నుంచి రూ.20 వరకు అమ్ముతున్నారు. ప్రతి ఒక్కరూ ఇష్టంగా తినే పుచ్చకాయలు మార్కెట్‌లో విరివిగా లభిస్తున్నాయి. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు ఇష్టంగా తింటున్నారు.

పోషకాలు పుష్కలం

పుచ్చకాయలో ఏ, సీ విటమిన్లు, పొటాషియం, మెగ్నీషియం, సోడియం, పీచు, క్యాల్షియంలు విస్తారంగా ఉన్నందున ఇది మంచి పోషకాహారం. శరీరానికి అవసరమైన శక్తినిస్తుంది. మంట, తాపాలను తగ్గిస్తుంది. ఇందులో ఉన్న ఏ–విటమిన్ కంటిచూపును మెరుగుపరిస్తే, సి–విటమిన్ రోగనిరోధకశక్తిని పెంచుతుంది. ఈ కాలంలో తరచుగా పుచ్చకాయ తినడం మంచిది. 92 శాతం నీటితో ఉన్న పుచ్చకాయ తినడం వల్ల గొంతు తడారిపోవడం, ఒంట్లో నీరు ఇంకిపోవడం, డీహైడ్రేషన్ లాంటి సమస్యలు తలెత్తవు. కండరాల నొప్పులను నిరోధిస్తుంది. ఇందులో చెడు కొలెస్టాల్ బొత్తిగా ఉండదు. గుండె జబ్బులను రానీయదు. శరీరాన్ని శుద్ధి చేస్తుంది. చర్మాన్ని సురక్షితంగా ఉంచుతుంది. రక్తంలో చక్కెర స్థాయిని పెరగనివ్వదు. జీర్ణప్రక్రియ సజావుగా ఉంటుంది. మూత్రపిండాలను ఆరోగ్యంగా ఉంచుతుంది. పుచ్చకాయ తినడం వల్ల ఆకలి తీరిన భావన కలుగుతుంది. ఇంకా తినాలనే తపన ఉండదు. ఈ కారణం వల్ల ఎక్కువ తినాల్సిన అవసరం ఉండదు. ఊబకాయం రాదు. బరువు తగ్గాలనుకునేవాళ్లకి ఇది శ్రేష్ఠం. ఎముకలు, దంతాలు దృఢంగా ఉంటాయి. కీళ్లనొప్పులు రావు. పుచ్చ గింజల్లో గొప్ప పోషకాలుంటాయి.

ఆరోగ్యానికి మంచిది



వేసవి కాలంలో లభించే పుచ్చకాయలు ఆరోగ్యానికి ఎంతో మంచిది. వేసవి తాపం నుంచి ఉపశమనం కలిగిస్తుంది. వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ ఈ పండును తినవచ్చు. ఇందులో ఉండే ఏ విటమిన్ కంటిచూపును మెరుగుపరుస్తుంది. ఎండ వేడికి ఒంట్లో నీరు ఇంకిపోవడం, డీహైడ్రేషన్ లాంటి సమస్యలు తలెత్తవు. రక్తప్రసరణ సక్రమంగా జరుగుతుంది. –డాక్టర్ మోనిక, మెడికల్ ఆఫీసర్, పలుకూరు పీహెచ్‌సీ

ఎండా కాలంలో వ్యాపారం



ప్రతి వేసవి కాలంలో పుచ్చకాయలను విక్రయిస్తాం. ఈ పండ్లను తిరుపతి, కడప, ప్రొద్దుటూరు, తమిళనాడు ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటున్నాం. వ్యాపారం బాగానే ఉంది. అన్ని ఖర్చులు పోను రోజుకు రూ.500 వరకు మిగులుతున్నాయి. పుచ్చకాయను కేజీ రూ.20 నుంచి విక్రయిస్తున్నాం. జనాలు కూడా కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. –బాషా, వ్యాపారి, బనగానపల్లె

తమిళనాడు నుంచి తీసుకొస్తున్నాం



మా కుటుంబం మొత్తం వేసవి సీజన్‌లో పుచ్చకాయల వ్యాపారం చేస్తుంది. పుచ్చకాయలను తమిళనాడు, కడప, మదనపల్లె ప్రాంతాల నుంచి టన్నుల లెక్కన కొనుగోలు చేస్తాం. కేజీ రూ.20 నుంచి 25 వరకు విక్రయిస్తున్నాం. ఉష్ణోగ్రతలు పెరగడంతో వ్యాపారం బాగా జరుగుతోంది. చల్లదనానికి వీటినే ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. –లచ్చి, పుచ్చకాయల వ్యాపారి, డోన్

92 శాతం నీరుంటుంది



పుచ్చకాయలో 92 శాతం నీరు ఉండడం వల్ల శరీరానికి చల్లదనాన్ని ఇస్తుంది. పోషకాలు కూడా ఎక్కువగా ఉంటాయి. పిల్లలు ఎక్కువగా తింటే జ్ఞాపక శక్తి పెరుగుతుంది. రక్తపోటు తగ్గుతుంది. పుచ్చకాయలో ఉండే మెగ్నీషియం, పొటాషియం గుండె ఆరోగ్యానికి తోడ్పడుతాయి. శరీరాన్ని శుద్ధి చేస్తుంది. చర్మాన్ని సురక్షితంగా ఉంచుతుంది. –డాక్టర్ రాంభూపాల్, కొత్తబురుజు పీహెచ్‌సీ

నేడు పాండురంగడి కల్యాణం

కోవెలకుంట్ల: పట్టణంలో శ్రీదేవి, భూదేవి సహిత పాండురంగ విఠలేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం ఆలయ అర్చకులు వేణుగోపాలాచార్యులు, సుదర్శనాచార్యుల ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం, వస్త్రాలంకరణ, విష్ణుసహస్రనామస్తోత్ర పారాయణం, మహా మంగళహారతి, తీర్థ ప్రసాద వితరణ జరిగాయి. అలాగే స్వామివారికి విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, మండపారాధాన, మహా కలశస్థాపన అంకురపూజ, ధ్వజారోహణం, బేరిపూజ తదితర కార్యక్రమాలు చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. శనివారం తెల్లవారుజామున స్వామివారి కల్యాణ మహోత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ధర్మకర్త వెంకటసుబ్బారెడ్డి తెలిపారు.

వధూవరులకు ఆశీర్వాదం

బనగానపల్లె రూరల్: పట్టణంలో ధనలక్ష్మీ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం జరిగిన కైప గ్రామానికి చెందిన కాశీరెడ్డి కుమారుడు రాజశేఖర్‌రెడ్డి వివాహానికి మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి హాజరయ్యారు. వధూవరులను ఆశీర్వదించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, అంబటి రవికుమార్‌రెడ్డి, ప్రతాప్ రెడ్డి తదితరులు ఉన్నారు.

సైనికుల కోసం పూజలు

డోన్ టౌన్: పహల్గాం ఉగ్రవాదుల దాడికి ప్రతిచర్యగా భారత ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సింధూర్ విజయవంతం కావాలని.. సైనికులు క్షేమంగా ఉండాలని కోరుతూ శుక్రవారం బీజేపీ నాయకులు పూజలు చేశారు. కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు హేమసుందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద ఉన్న దుర్గమ్మ గుడిలో పూజలు చేశారు.

వేడుకగా తిరుచ్చి ఉత్సవం


మద్దిలేటిస్వామికి ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

బేతంచెర్ల: ప్రముఖ వైష్ణవ పుణ్యక్షేత్రమైన మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి స్వామి వారికి తిరుచ్చి ఉత్సవం నిర్వహించారు. ఉప కమిషనర్ రామాంజనేయులు, వేద పండితుడు జ్వాలా చక్రవర్తి ఆధ్వర్యంలో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీల్లో కొలువుంచి ఆలయ మాడ వీధుల్లో మంగళవాయిద్యాలు, భక్తుల గోవింద నామస్మరణ నడుమ ఊరేగింపు నిర్వహించారు.

అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలి


సమ్మె నోటీసు అందజేస్తున్న అంగన్‌వాడీలు

డోన్ టౌన్: అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి వారి సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ పట్టణ, మండల కార్యదర్శులు శివరామ్ ,భాస్కర్‌రెడ్డి, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు సులోచన, సుమలత, యశోద ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జేఏసీ పిలుపు మేరకు ఈ నెల 20వ తేదీ జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు సంబంధించిన నోటీసును శుక్రవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌కు అందజేశారు.

కొత్త రేషన్‌కార్డులకు దరఖాస్తు చేసుకోండి

కోవెలకుంట్ల: అర్హత ఉండి ఇప్పటి వరకు రేషన్‌కార్డులు లేని వారు కొత్త వాటి కోసం దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డి అన్నారు. కొత్త కార్డులతోపాటు కార్డుల్లో కుటుంబ సభ్యుల విభజన, కొత్త సభ్యుల చేర్పు, చిరునామా మార్పు, మృతి చెందిన వారి పేర్లు తొలగింపు, రేషన్‌కార్డుల్లో ఆధార్ సీడింగ్‌లో సవరణ, ఒంటరి మహిళలకు కొత్త రేషన్‌కార్డులు, తదితర వాటికోసం ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. మండలంలోని అర్హులైన లబ్ధిదారులు గ్రామ సచివాలయల్లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

16న రాతిదూలం పోటీలు

కోవెలకుంట్ల: పట్టణంలోని పాండురంగస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 16వ తేదీ నుంచి ఉభయ రాష్ట్రాల స్థాయి రాతిదూలం లాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. న్యూ కేటగిరి ఎడ్ల బలప్రదర్శన పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచే వృషభాల యజమానికి రూ. 1.10 లక్షలు, ద్వితీయస్థానం రూ. 90 వేలు, తృతీయ స్థానం రూ. 70 వేలు, ఆ తర్వాత వరుసగా రూ. 50 వేలు, రూ. 40 వేలు, రూ. 30 వేలు, రూ. 20 వేలు, రూ. 15 వేలు, రూ. 10 వేలు చొప్పున నగదు బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన వృషభాల యజమానులు ఆలయ కమిటీని సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు.

ముగిసిన ఆలయ వార్షికోత్సవం

ప్యాపిలి: స్థానిక సాయిబాబా ఆలయంలో రెండు రోజులుగా జరిగిన వార్షికోత్సవాలు శుక్రవారం ముగిశాయి. ముగింపు వేడుకల్లో భాగంగా ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. భక్తులతో ఆలయ ప్రాంగణంలో సందడి వాతావరణం నెలకొంది.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్యాపిలి: 11కేవీ నూతన ఫీడర్ నిర్మాణ పనులు చేపడుతున్న కారణంగా నల్లమేకలపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ వినయ్ కుమార్ శుక్రవారం తెలిపారు. నల్లమేకలపల్లి, డి. రంగాపురం, మామిళ్లపల్లి గ్రామాల్లో ఉదయం 9 నుంచి 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. వ్యవసాయానికి తెల్లవారుజామున 3 నుంచి 9 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా చేస్తామన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

బేతంచెర్ల: పట్టణంలో విద్యుత్ స్తంభాల మరమ్మతు పనుల కారణంగా శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏడీ మధుసూదన్ రెడ్డి, టౌన్ ఏఈ పుల్లయ్య తెలిపారు. పట్టణంలోని విద్యుత్ వినియోగదారులు, పరిశ్రమల యజమానులు సహకరించాలని కోరారు.

గర్భిణిని హత్య చేసిన వారిని శిక్షించాలి


బాధితులతో కలిసి ధర్నా చేస్తున్న ఐద్వా నాయకులు

డోన్ టౌన్: పట్టణంలో మూడు నెలల గర్భిణిని హింసించి హత్య చేసిన భర్త ఎల్లప్ప, అత్తమామలు, బావలను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ఐద్వా నాయకురాలు షమీమ్ బేగం, మాధవి, షబానా, లక్ష్మీదేవి డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఆస్పత్రి వద్ద మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం మృతురాలి తల్లిదండ్రులు, బంధువులతో కలిసి జరిగిన సంఘటనపై వివరాలు తెలుసుకున్నారు. హత్య చేసిన వారిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేశారు. ఆత్మహత్య చేసుకుందని కట్టు కథలు అల్లారని, హత్య అని తెలియడంతో రాత్రికి రాత్రే అందరూ పరారయ్యారని ఆరోపించారు. రాష్ట్రంలో అడవారికి రక్షణ కరువైందన్నారు.

కక్ష సాధింపు చర్యలు సరికాదు


ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న పాత్రికేయులు

డోన్: కూటమి నాయకులు చేస్తున్న అక్రమాలు, అవినీతిని వెలుగులోకి తెస్తున్నారనే కక్షతో సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనుంజయరెడ్డి ఇంట్లోకి పోలీసులు అనుమతి లేకుండా ప్రవేశించి తనిఖీలతో అలజడి సృష్టించారని పాత్రికేయ సంఘాలు ఆరోపించాయి. ప్రభుత్వ తీరుకు నిరసనగా శుక్రవారం విలేకరులు నల్లబ్యాడ్జీలు ధరించి డోన్ ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆర్డీఓ రంగనాయకులుకు వినతిపత్రం అందజేశారు. పాత్రికేయ సంఘం నాయకులు విజయమోహన్, మహమ్మద్ షఫీ, లక్ష్మీనారాయణ, రంగారెడ్డి, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఆదమరిస్తే అంతే..!

మండల పరిధిలోని నట్లకొత్తూరు గ్రామ సమీపంలో కల్వర్టు ప్రమాదకరంగా మారింది. గులాంనబీపేట నుంచి నట్లకొత్తూరు మధ్యలో ఉన్న ఈ కల్వర్టుపై పెద్ద రంధ్రం ఏర్పడింది. వాహనదారులు ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా పెద్ద ప్రమాదం జరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా రాత్రి సమయంలో అజాగ్రత్తగా ఉంటే అంతే సంగతులు. ప్రమాదం జరగకముందే అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని వాహనదారులు కోరుతున్నారు. –సంజామల


నట్లకొత్తూరు సమీపంలో కల్వర్టుపై ఏర్పడిన రంధ్రం

రామనామంలో అనంత శక్తి


పేరుసోములలో గోపూజ చేస్తున్న భక్తులు

సంజామల: విశ్వశక్తి అంతా రామనామంలో ఇమిడి ఉందని.. అలాంటి రామనామంతో సమస్త జీవులు తరిస్తాయని విష్ణుకంటి క్షేత్రం పీఠాధిపతి శ్రీరామ్మోహన్ స్వామి అన్నారు. మండల పరిధిలోని పేరుసోముల గ్రామంలో తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ విభాగం అధ్వర్యంలో శుక్రవారం ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. గోపూజ, కుంకుమార్చనలు చేశారు. కార్యక్రమంలో టీటీడీ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూల్ జిల్లా కార్యనిర్వాహన అధికారి డాక్టర్ మల్లు వెంకటరెడ్డి, ముఖేష్ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న దివ్యాంగుల సంఘం నాయకుడు దేవరాజు

కోవెలకుంట్ల: దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలు గుర్తించి వాటిని పరిష్కరించాలని ఆ సంఘం జిల్లా జేఏసీ అధ్యక్షుడు అందనం దేవరాజు అన్నారు. శుక్రవారం కోవెలకుంట్లలో ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగులకు త్రీవీలర్ స్కూటీలు, ఇళ్లస్థలాలు, డబుల్ బెడ్‌రూం ఇళ్లు, వార్షిక బడ్జెట్‌లో ప్రవేశపెట్టిన రూ. 4 వేల కోట్లను దివ్యాంగుల అభ్యున్నతికి వెచ్చించాలని డిమాండ్ చేశారు. దివ్యాంగులకు వివాహ ప్రోత్సాహ బహుమతి, స్థానిక సంస్థల ఎన్నికల్లో 5 శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. వచ్చే నెలలో నిర్వహించనున్న డీఎస్సీలో ఉమ్మడి కర్నూలు జిల్లాలో దివ్యాంగులకు కేటాయించిన ఖాళీల వివరాలు తెలియజేయాలని కోరారు. బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేసి న్యాయం చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సంఘం నాయకులు నారాయణరెడ్డి, రమణ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రేపు పరుగు పోటీలు


మాతృ దినోత్సవ కార్యక్రమాలను వివరిస్తున్న ఇన్నర్‌వీల్ క్లబ్ సభ్యులు

డోన్: మాతృ దినోత్సవాన్ని ఈనెల 11వ తేదీ ఆదివారం ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఇన్నర్వీల్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు మద్దమ్మ గౌడ్, శకుంతల రెడ్డి తెలిపారు. స్థానిక కార్యాలయంలో క్లబ్ సభ్యులతో కలిసి కార్యక్రమ వివరాలను వెల్లడించారు. స్థానిక నెహ్రూనగర్ ద్రోణా హైట్స్ సమీపంలోని రహదారిపై 3, 5, 8 కిలోమీటర్ల పరుగు పందేలను తల్లులకు నిర్వహిస్తున్నామన్నారు. ఆరోగ్యకరమైన, బలమైన సూపర్ మామ్‌ల పేరుతో విజేతలకు నగదు బహుమతులతో పాటు ప్రోత్సాహక సర్టిఫికెట్లను అందజేస్తామని తెలిపారు. కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ ప్రారంభిస్తారని చెప్పారు. స్థానిక వైద్యులు బాలచంద్రారెడ్డి, అనితారెడ్డి ఆర్థిక సహకారంతో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న మహిళలు 9985802755, 9441948853 నంబర్లను సంప్రదించాలన్నారు.

మురుగుతో అవస్థలు


రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

డోన్: స్థానిక కొత్తబస్టాండ్ సమీపంలోని శ్రీనివాసనగర్‌లో మురుగునీరు రోడ్లపై చేరి దుర్వాసన వెదజల్లుతోంది. డోన్, బేతంచెర్ల మున్సిపాలిటీలకు రూ.30కోట్ల నిధులు మంజూరు చేయించామని గొప్పలు చెప్పుకుంటున్న అధికార పార్టీ నాయకులు తమ పలుకుబడిని ఉపయోగించి ప్రధాన రహదారులకు ఇరువైపులా డ్రైనేజీలు, వాటిపై కల్వర్టులను నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. మట్టి కాలువలు చెత్త, చెదారంతో నిండిపోతుండడంతో మురుగునీరంతా ప్రధాన రహదారులపై చేరి పాదాచారులు, వాహనదారులకు తీవ్ర అసౌకర్యం కలగజేస్తోందని వాపోతున్నారు.

నిరుపయోగంగా పట్టుపరిశ్రమ భవనం



నిరుపయోగంగా ఉన్న పట్టు పరిశ్రమ భవనం, కార్యాలయ ప్రాంగణంలో పడి ఉన్న మందు సీసాలు

ప్యాపిలి: పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహం పక్కనే ఉన్న పట్టు పరిశ్రమశాఖ భవనం నిరుపయోగంగా మారింది. గతంలో ఇక్కడ పట్టు పురుగుల పెంపకం, గూళ్ల ఉత్పత్తి చేపట్టారు. మల్బరీ సాగుపై రైతులకు అవగాహన సదస్సులు, శిక్షణ తగరతులు నిర్వహించేవారు. అయితే కొన్నేళ్ల క్రితం ఇక్కడ ఉన్న పట్టు పరిశ్రమ కేంద్రాన్ని కర్నూలుకు తరలించారు. దీంతో ఈ భవనం నిరుపయోగంగా మారింది. ప్రస్తుతం ఈ ప్రాంగణం మందుబాబులకు, అసాంఘిక చర్యలకు నిలయమైంది. ప్రభుత్వం స్పందించి ఈ అభవనాన్ని వినియోగంలోకి తీసుకురాకపోతే శిథిలావస్థకు చేరుకుంటుంది.

నోరూరించే చింత చిగురు!


చింతచిగురు కోసుకుంటున్న మహిళలు

కొలిమిగుండ్ల: పచ్చబంగారంలా చిటారు కొమ్మన మిలమిల మెరిసే చింత చిగురును తింటే ఆరోగ్యంపై చింత అవసరం లేదంటారు పెద్దలు. నోటికి పుల్లగా రుచిని ఇస్తూ తినేకొద్దీ తినాలనిపిస్తుంది. చింతచిగురును ఇష్టపడని వారంటు ఉండరు. వర్షాలు కురవడంతో చింత చెట్లు చిగురిస్తున్నాయి. కొలిమిగుండ్ల విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలోని ప్రధాన రహదారి పక్కనే ఉన్న చింతచెట్ల వద్ద చిగురు కోసుకునేందుకు మహిళలు పోటీపడ్డారు. కొంత మంది చెట్లు ఎక్కగా మరికొంత మంది కిందనే కుర్చీలు వేసుకుని కోసుకున్నారు. చింత చిగురుతో తయారు చేసుకునే పప్పు, పచ్చడి అంటే ఏ వయసు వారైనా తృప్తిగా ఆరగిస్తారు.